పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 19.07.2014

తెలంగాణలోని అన్ని నగరాలు, పట్టణాలు పరిశుభ్రమైన, ఆకుపచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణం వున్న ప్రాంతాలుగా మారాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌తో సహా ఇతర కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు చెత్తకుండిలుగా మారాయని, వీటిని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని ఆదేశించారు. మున్సిపాలటీలను చక్కగా తీర్చిదిద్దడమనేది ఓ సవాలుగా స్వీకరిస్తున్నానని అందుకే మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నానని కేసిఆర్ ప్రకటించారు. మున్సిపాలిటీలను మురికి కూపం నుండి బయట పడేయటానికి అవసరమైన వ్యూహాలు అనుసరించాలని, ఇందు కోసం కార్పోరేషన్ల మేయర్లు, కార్పోరేటర్లు, మున్సిపాలిటీ చైర్మన్లు, కౌన్సిలర్లకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో శిక్షణనివ్వాలని నిర్ణయించారు. శిక్షణా కార్యక్రమంలో తాను కూడా రిసోర్సు పర్సన్‌గా పాల్గొంటానని సిఎం వెల్లడించారు. స్థానిక సంస్థలకు అధికారాలు బదిలీ చేయాలని ఇదే సందర్భంలో వారిపై బాధ్యతలు కూడా పెట్టాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణలో మంచినీటి సరఫరా కోసం ఒ ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని, పట్టణ ప్రాంతాలలో విచ్చలవిడిగా జరుగుతున్న నిర్మాణాలను నియంత్రించేందుకు కూడా సరైన చర్యలు తీసుకోవాలని ఈ రెండింటి విషయంలో అవసరమైతే చట్టం చేసేందుకు కూడా ప్రతిపాదనలు తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అన్ని నగరాలు, పట్టణాలకు సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించాలని, ఇందుకోసం అవసరమైతే విదేశి కన్సల్టెంట్లను కూడా వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మరో కోటి మంది అవసరాలు తీరేలా హైదరాబాద్ నగరాన్ని సిద్ధం చేయాలని సూచించారు.

సచివాలయంలో శనివారం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, టౌన్ డెవలప్‌మెంట్‌పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖామంత్రి తన్నీరు హరీష్ రావు, ఎక్సైజు శాఖ మంత్రి పద్మారావు, ప్రభుత్వ సలహాదారుడు బి.వి.పాపారావు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి డా.ఎస్.కె.జోషి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమీషనర్ బి.జనార్దన్ రెడ్డి, జలమండలి ఎండి జగదీష్ ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. దేశంలో కాని, ప్రపంచంలో కాని ఎక్కడ మంచి టౌన్ ప్లానింగ్ వుందో అధ్యయనం చేసి ఇక్కడ అలాంటి టౌన్ ప్లానింగ్‌ను రూపొందించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ విభాగం కూడా అవినీతిలో కూరుకుపోయిందని,

దీన్ని సరళంగా, పారదర్శకంగా వుండే విధంగా తీర్చిదిద్దాలని చెప్పారు. పట్టణ ప్రాంతాలలో నిర్మాణాలకు అనుమతులిచ్చే అధికారం కూడా వికేంద్రీకరణ జరగలాని కోరారు. వివిధ ప్రభుత్వ పథకాల్లో ఏటా 15 వేల కోట్ల అవినీతి జరుగుతోందని, అందులో మున్సిపాలిటీలు కూడా వున్నాయని చెప్పారు. ఇప్పుడు కొత్త రాష్ట్రం కాబట్టి మనం నగరాలు, పట్టణాలను చక్కగా తయారు చేసుకోవచ్చన్నారు. ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే ఎవరినైనా సరే ఇంటికి పంపిస్తానని, చివరికి మంత్రి అయినా సరే పదవి నుండి తప్పిస్తానని ముఖ్యమంత్రి హెచ్చరించారు. మున్సిపల్ పాలనలో అవినీతి వ్యవస్థీకృతమయిపోయిందని, ఫిక్స్‌డ్ పర్సంటేజి వ్యవస్థ వున్నదని, అందుకే ప్రజాధనం ధుర్వినియోగం అవుతోందని, మున్సిపాలటీలో చేసే నిర్మాణాలు మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలటీలలో ఎన్నికయిన ప్రజాప్రతినిధులకు కూడా నిర్దిష్టమైన విధులు, అధికారాలు, బాధ్యతలు వుండాలని, ఇందుకోసం అవసరమైతే ఇప్పుడున్న చట్టాలను మార్చాలని సూచించారు. పన్నుల విధానాన్ని సరిగా అమలు చేయాలని, ఆస్థి పన్ను విధించే సందర్భంగా చేసే అంచనాల దగ్గరే అవినీతి జరుగుతున్నదని, దీనిని అరికట్టేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. వీటన్నింటి కోసం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లో కొత్త గైడ్ లైన్స్ తీసుకురావాలని చెప్పారు. మంచినీరు, డ్రైనేజ్, విద్యుత్, రవాణా, గ్రీనరీ, రోడ్లు తదితర అంశాలన్నీ మెరుగుపడేలా మున్సిపాలటీలు వుండాలన్నారు. హైదరాబాద్ నగర ంలో మరో రెండు సికింద్రాబాద్ లాంటి రైల్వే జంక్షన్‌లు, ఇమ్లిబన్ లాంటి మరో అయిదు బస్ టర్మినల్స్ కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మరో కోటి మందికి హైదరాబాద్‌లో నీరిచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్దం చేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణా నది నుండి హైదరాబాద్‌కు 70 టిఎంసిల నీటిని రప్పిస్తామని అన్నారు.

వివిధ కారణాల వల్ల వాయిదా పడిన రెండు కార్పోరేషన్లు, 9 మున్సిపాలిటీల ఎన్నికలపై వివరాలు సిఎం అడిగి తెలుసుకున్నారు. వరంగల్, ఖమ్మం కార్పోరేషన్లు, మరో ఎనిమిది మున్సిపాలటీలలో ఎన్నికలు పూర్తయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మెదక్ జిల్లా దుబ్బాకను మేజర్ గ్రామపంచాయతి గానే కొనసాగించాలని సిఎం నిర్ణయించారు. ఎన్నికలు నిర్వహించేందుకున్న అడ్డంకులు, వాటిని తొలగించుకునే మార్గాలతో సవివరమైన నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. సోమవారం నాటికి స్పష్టత వస్తే తొందరలోనే ఎన్నికలు నిర్వహించే విధంగా ఎన్నికల సంఘానికి సిఫారసు చేయవచ్చని ముఖ్యమంత్రి చెప్పారు.

ప్రస్తుతం నగరాలు, పట్టణాలలో ప్రణాళికల తయారీ విషయాన్ని కూడా సిఎం అడిగి తెలుసుకున్నారు. ఒక్కో పట్టణంలో ఒక్కో రకమైన అవసరం వుంటుంది కాబట్టి ప్రణాళికలు కూడా స్థానిక పరిస్థితులకు అనుగుణంగానే వుండాలని ముఖ్యమంత్రి చెప్పారు. తెలంగాణలోని ప్రతి

పట్టణం, ప్రతి నగరానికి ప్రత్యేక ప్రణాళిక వుండాలని, వచ్చే ఏడాది నుండి దానికి అనుగుణంగానే బడ్జెట్ కేటాయింపులు జరుపుతామని కూడా సిఎం చెప్పారు.

పట్టణాలు, నగరాలలో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోతున్నదని, డంప్ యార్డులు లేక పోవడం వల్ల రోడ్ల ప్రక్కనే చెత్త వేస్తున్నారని చెప్పారు. ప్రతి మున్సిపాలిటీలో అవసరమైనన్ని డంప్ యార్డులను ఏర్పాటు చేసుకోవాలని ఇందుకోసం ప్రభుత్వం నిధులు ఇవ్వడానికి సిద్ధంగా వున్నదని చెప్పారు. వివిధ కార్పోరేట్ కంపెనీలు కుడా సామాజిక బాధ్యతలో భాగంగా చెత్తా చెదారాన్ని తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి సహకరిస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. పట్టణ ప్రాంతాలలో స్మశాన వాటికలు, బొందల గడ్డలు ఎక్కువ చేయాలని సూచించారు. పట్టణాలలో స్మృతి వనాలు ఏర్పాటు చేయాలని, మరణించిన వారి పేరుమీద అందులో కుటుంబ సభ్యులు ఒ మొక్కను నాటి, ఆ చెట్టుకిందే కనీసం ఏడాదికొసారి మరణించిన వారి జ్ఞాపకాలను నెమరు వేసుకునే సంస్కృతిని ప్రవేశ పెట్టాలని చెప్పారు. దోభి ఘాట్లను నిర్మించాలని, ఇండ్లల్లో చెత్తను సేకరించి, వాతావరణ కాలుష్యం కాకుండా ఆ చెత్తను అంతం చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాలలో ప్రజలు తాగునీటికి ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారని, ఏ పట్టణానికి ఎంత నీరు అవసరమనే కనీస అంచనాలు కూడా సరిగా లేవని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకోసం మరోసారి సర్వే నిర్వహించాలని సిఎం సూచించారు. కొత్తగా కట్టే నీటి పారుదల ప్రాజెక్టులు, ఇప్పటికే వున్న నీటి పారుదల ప్రాజెక్టుల్లో పది శాతం నీటిని మంచినీటి సరఫరా కోసం వినియోగించేలా ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకొంటుందని కూడా చెప్పారు. పట్టణాలలో వంద శాతం ఆస్థి పన్ను వసూలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని, నాన్ ట్యాక్స్ రెవిన్యూ కూడా సరిగా వసూలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. పన్నుల నిర్ణయం, వసూలు విషయంలో అవకతవకలు నివారించాలని, లోపాలను సవరించాలని, విచ్చలవిడి తనానికి సస్తి చెప్పాలని ఆదేశించారు. ఇప్పుడున్న పట్టణాలలో ఎన్నింటికి రింగు రోడ్లు వున్నాయి, ఎన్నిటికి సరైన మాస్టర్ ప్లాన్ వుంది, ఎన్ని చోట్ల బైపాస్ రోడ్లు వున్నాయి, డివైడర్స్‌తో కూడిన రోడ్లు ఎన్ని వున్నాయి, బట్టర్‌ఫ్లై లైట్లు ఎన్ని చోట్ల వున్నాయి అనే విషయాలపై సమగ్రమైన నివేదిక సమర్పించాలని సూచించారు. మున్సిపాలటీల పరిధిలోని భూములను కాపాడుకోవడానికి కఠినంగా వ్యవహరించాలని, అన్ని మున్సిపాలటీలను కంప్యూటరీకరించాలని, తెలంగాణ మొత్తానికి 4జి అందుబాటులోకి రానున్నందున ఆ విజ్ఞానాన్ని కూడా ఉపయోగించుకోవాలని చెప్పారు. మహిళల స్వయం సహాయక బృందాల మాదిరిగానే పురుషుల కోసం కూడా స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

పట్టణాలలో కూరగాయల మార్కెట్లను ఆరోగ్యకరమైన ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, పండ్ల మార్కెట్లు ఏర్పాటు చేయాలని, మాంసం, చేపల క్రయవిక్రయాల కోసం ప్రత్యేక మార్కెట్లు

ఏర్పాటు చేయాలని సూచించారు. మున్సిపాలిటీలలోని పార్కులను ఉపయోగంలోకి తీసుకురావాలని, పిల్లల గార్డెన్లను అభివృద్ధి చేయాలని, టౌన్ హాళ్లను నిర్మించాలని చెప్పారు. రవీంద్రభారతి లాంటి ఆడిటోరియాలు, క్రీడా మైదానాలు, చెరువులు, భూగర్భ డ్రైనేజి వ్యవస్థ తదితర అంశాలలో పరిస్థితిని వివరిస్తూ నివేదిక తయారు చేయాలని కూడా ముఖ్యమంత్రి చెప్పారు. పట్టణ ప్రాంతాలలో గతంలో అమలు చేసిన రాజీవ్ స్వగృహ పథకం, మురికివాడల స్థితిగతులు తెలపాలని ఆదేశించారు. మొత్తంగా మున్సిపాలిటీల రూపురేఖలు మారాలని, తెలంగాణ రాష్ట్రంలో వీటి పరిస్థితి చాలా మెరుగు కావాలని సూచించారు. ప్రైవేటు ట్యాక్సీలు, క్యాబ్‌లు, ఆటోల కోసం పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.

---

సిపిఆర్ఓ టు సిఎం.